# నిర్ణయం

తెల్లవారు ఝామును దాటి చీకటి తెరలను చీల్చుకుంటూ పైకి రావటానికి ప్రయత్నిస్తున్నాడు సూర్యుడు. బద్ధకాన్ని వదిలించుకుని నిద్రలేచి తమతమ పనులలో తాము మునిగి పోతున్నారు పల్లె ప్రజలు.

నెల్లూరునుండి నరసరావుపేట వెళ్ళే సూపర్ డీలక్స్ బస్సు చక్రాయపాలెంలో ఆగదు. కానీ నరసరావుపేట వరకూ టికెట్ తీసుకుని కండక్టరును రిక్వెస్టు చేసి బస్సు ఆపించి దిగాడు విద్యాధర్.

అచ్చమైన 'పల్లె' పదానికి సంకేతం ఆ వూరు. తూర్పు వైపున భవనాశి చెరువు. రెండు వందల ఎకరాలను తన నీరు నందిస్తూ సశ్యశ్యామలం చేస్తున్నది ఆ కల్పవల్లి. పడమర వైపున గుండ్లకమ్మనది. లక్షలాది మందికి త్రాగటానికి తియ్యని నీరు నందిస్తూ విలాసంగా ప్రవహిస్తుంటుంది ఆ నదీమతల్లి.

ఆ నేలమీద దిగీ దిగగానే గత స్మృతులు మదిలో మెదిలాయి విద్యాధర్‌కు.

ఇరవై సంవత్సరాల క్రితం విద్యాధర్ తండ్రిగారు ఆ గ్రామంలో టీచర్‌గా పని చేసేవారు. అక్కడే పుట్టి



ఇలపావులూరి మురళీమోహనరావు

ఏడు సంవత్సరాలు పెరిగాడు విద్యాధర్.

అపుడు విద్యాధర్ వాళ్ళుండే ఇంటి పక్కనే ఉండేది మీనాక్షి. మీనాక్షికి పదిహేడు సంవత్సరాలుంటాయి. తాను ఆమెను "అక్కయ్యా" అని పిలిచేవాడు.

మీనాక్షి భర్త సింహాచలం పెద్ద త్రాగుబోతు. చిన్న హోటల్ నడుపుతూ మీనాక్షి సంపాదించే రెండో, మూడో, మీనాక్షిని చావగొట్టి తీసుకెళ్ళి త్రాగొచ్చేవాడు. వచ్చిన తరువాత మరలా ఏదో వక వంకపెట్టుకుని మరలా కొట్టేవాడు.

పరులెవరిముందు తన బాధను వెల్లడించేది కాదు మీనాక్షి. విద్యాధర్‌ను ఎంతో ప్రేమగా చూచేది. రోజూ తినడానికేమైనా పెడుతుండేది. మీనాక్షి కూతురు ప్రమిదను తాను ఎత్తుకుని ఆడించేవాడు. ఇపుడు వాళ్ళేం చేస్తున్నారో!!

రెండిళ్ళ అవతల శేషాచలం మాష్టారు గారుండేవారు. ఆయన స్కూలు హెడ్‌మాస్టరు. ఆ వూరి వాడే. బాగా కలిగినవాడు. ఊరు మొత్తంలో వారిదొక్కరిదే ఇల్లు అని చెప్పుకోతగినది. తాత ముత్తాతలు బాగా సంపాదించారు. వారు సంపాదించిన దానిని తన తెలివితేటలు ఉపయోగించి నాలుగింతలు చేశాడాయన. పైగా హెడ్మాస్టరు కావడంతో ఆయనకు మంచి గౌరవ మర్యాదలు లభించేవి.

ఆయనకు ఒక కూతురుండేది. పేరు కిరణ్మయి. విద్యాధర్ క్లాస్‌మేట్. కలిగిన వాళ్ళమ్మాయి కావడంతో ఎంతో ఆరోగ్యంగా, పుష్టిగా ఉండేది. ఆ వయసులోనే ఆమెంటే విద్యాధర్‌కు ప్రత్యేకాభిమానం ఉండేది.

ఇపుడు ఆమె బాగా ఎదిగి మగవారి గుండెల్లో గుబులు రేపుతుండవచ్చు. ఆమె సౌందర్య శిఖలు మరింత శోభాయమానమై ఎంతటి పురుషుడినైనా పాదాక్రాంతుడిని చేసుకునే హొయలు చిలికిస్తుండవచ్చు. ఎంతవరకూ చదివిందో? ఇపుడేం చేస్తున్నదో!

ఊరు ఏమీ మారలేదు. ఇరవై సంవత్సరాల క్రితం ఎలా వున్నదో, ఇపుడూ అలాగే ఉన్నది. అవునుమరి! పల్లెల అభివృద్ధి పట్ల ఉపన్యాసాలు దంచేవారేకానీ ఆచరించే వారెవరున్నారు?

"ఇన్‌షర్టు" వేసుకుని కొత్తగా దిగిన వారెవరబ్బా? అని కొందరు ఆశ్చర్యంగా. చూడసాగారు.

"ఎవరైనా ఆఫీసరేమో!" అని కొంతమంది అనుకుంటూ దూరంగా జరిగి పోతున్నారు.

విద్యాధర్ కొంతమందిని గుర్తుపట్ట సాగాడు.

ఆ నాటి కుర్రవాళ్ళు కొందరు మధ్య వయస్కులుగా దర్శనమిస్తున్నారు. ఆనాడు కొత్తగా కాపురాలకు వచ్చిన భామలంతా అమ్మమ్మల్లాగా కనపడు తున్నారు.

పల్లెటూర్లలో ఇది చాల సహజం. ప్రభుత్వం ఎంత మొత్తుకుంటున్నా తమ పిల్లలకు పదిహేనేళ్ళు నిండీ నిండగానే పెళ్ళి చేస్తారు. వాళ్ళకు వెంటనే పిల్లలు పుడితే వాళ్ళకు పదిహేను, పదహారేళ్ళు రాగానే పెళ్ళిళ్ళు చేస్తారు. ముప్పైరెండేళ్ళు వచ్చేసరికి తాము అమ్మమ్మో, నాయనమ్మో అనిపించు కుంటారు. ఐదారు తరాలు చూచేవారు పల్లెల్లో మాత్రమే ఉంటారు. ఆ వయసుకు పట్నాల్లో అమ్మాయిలు పెళ్ళిళ్ళు కూడా చేసుకోరు.

మీనాక్షి హోటల్ వైపు వెళ్ళాడు విద్యాధర్. మీనాక్షిని గుర్తించాడు. చూడగానే ఆమెలో ఏదో లోపం కనిపించిందతనికి.

ఆలోచిస్తున్న లోపే "ఏం కావాలి?" అని అడిగింది మీనాక్షి.

"అక్కయ్యా" అని పిలవబోయి ఆగాను.

రాతి బెంచీల మీద కూర్చుని నలుగు రైదుగురు కాఫీలు త్రాగుతున్నారు. ఇరవై సంవత్సరాల లోపు యువతి వారికి కావాల్సినవి అందిస్తున్నది.

"నన్ను గుర్తించావా? నేను విద్యాధర్‌ను." అన్నాడు విద్యాధర్. ఆమె ఒక క్షణం ఆలోచనలో పడ్డది.

"గుర్తుకు రావటం లేదు. ఎవరు మీరు?" అని ప్రశ్నించింది.

"సుమారు ఇరవై సంవత్సరాల క్రితం మీ యింటి పక్కనే ఉన్నాం. రఘురాం మాస్టరు గారబ్బాయిని' అన్నాడు విద్యాధర్.

"ఆఁ... నీవు విద్యావా?" రెండు నిముషాలు ఆశ్చర్యంలో మునిగి పోయింది.

"అవునక్కయ్యా" నవ్వుతూ అన్నాడు విద్యాధర్.

"ఓహో! సూటు బూటులో దర్జాగా వుంటే గుర్తుపట్టలేక పోయాను. అపుడే ఎంత ఎదిగి పోయావు? రా... రా.... లోపలికి రా..." అంటూ ఇంట్లోకి నడిచింది.

"ఆనాటి చిరునవ్వు, ఆప్యాయత ఏమాత్రం మారలేదు. కొంతమంది ఆశ్చర్యంగా చూడసాగారు.

"ఏమిటి ఆగావు? నీకిక్కడ కొత్త ఏముంది. రా విద్యా" అని పిలిచింది మీనాక్షి.

విద్యాధర్ లోపలకు వెళ్ళాడు.

"కూర్చో బాబూ... ఇరవై ఏళ్ళు గడిచినా నువ్వీ వూరును, మమ్మల్ని మర్చిపోలేదన్న మాట. మేమింకా మీకు గుర్తున్నామా? అంతా బాగున్నారా? అమ్మ నాన్నలేం చేస్తున్నారు? బామ్మ బాగున్నదా? అన్నయెలా వున్నాడు? చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళయ్యాయా? నీక్కూడా అయిందా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

విద్యాధర్ చిరునవ్వు నవ్వాడు.

తానీ వూరు మర్చిపోక పోవడానికి కారణం అక్కయ్యకేం తెలుసు? ఎన్నాళ్ళ నుండో తాను కంటున్న కలలు ఈనాడు నిజం చేసుకోవడానికి ఈ వూరు వచ్చానని బహుశా అక్కకు తెలియదు.


"అక్కయ్యా నీ అన్ని ప్రశ్నలకూ సమాధానం ఒక్కటే. అంతా ఓ.కె. అమ్మ నాన్నలు బాగున్నారు. బామ్మ ఆరోగ్యం ఓ మాదిరిగా ఉన్నది. అన్నయ్యకు పెళ్ళయింది. నేను ప్రయత్నాలలో వున్నాను" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి గలగలా నవ్వింది.

అక్కయ్యా అని పవిత్ర భావంతో పిలుస్తున్నపుడు అనుకోకూడదు కానీ మీనాక్షి నవ్వు ఎంతో అందంగా వుంటుంది. ఆమె నవ్వులో ఆకర్షణ ఏమీ తగ్గలేదు. ఎదుటి వారి మానసిక వ్యథలను మరపింప చేసే నవ్వు ఆమెది.

కాఫీ యిచ్చింది మీనాక్షి. కాఫీ కప్పులో కిరణ్మయి ఊహా చిత్రం కనిపించింది విద్యాధర్‌కు. అమృతాన్ని సేవించినట్లుగా త్రాగాడు కాఫీని.

"అవునూ సింహాచలం కనిపించటం లేదు. ఎక్కడి కెళ్ళాడు?" అడిగాడు విద్యాధర్.



# నిర్ణయం

మరుక్షణంలో మీనాక్షి నయనాల నుండి రెండు అశ్రువులు జారి క్రింద పడ్డాయి.

"ఏమయిందక్కయ్యా" గాభరాగా అడిగాడు విద్యాధర్. "నా అదృష్టం బాగా లేదు విద్యా. ఆ పాడు త్రాగుడు మానుకొమ్మని నెత్తీ నోరు కొట్టుకుని చెప్పినా నన్ను చావ గొట్టేవాడే కానీ నా మాట చెవిన పెట్టుకున్న పాపాన పోలేదు. ఒక రోజు సాయంత్రం బాగా తాగి తూలుతూ రోడ్డు దాటుతూ లారీ క్రింద పడ్డాడు. నా కళ్ళ ముందే నెత్తుటి ముద్దైపోయాడు" ఆపుకోలేక భోరున రోదించింది మీనాక్షి.

విద్యాధర్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎంత దారుణం! ఇంత చిన్నవయసులో నీ కెంత కష్టం వచ్చిందక్కయ్యా? ఎన్నాళ్ళైంది?" అన్నాడు బాధగా.

ఆరేళ్ళయింది. పెళ్ళి కెదిగిన కూతురును నాకప్పగించి తాను తప్పించుకున్నాడు." అన్నది మీనాక్షి కళ్ళు తుడుచుకుంటూ.

"మర్చేపోయాను. ఇందాక హోటల్లో నేను చూచిన అమ్మాయి ప్రమిదేనా?" అడిగాడు విద్యాధర్.

"అవును. ప్రమిదా" అని పిలిచింది మీనాక్షి.

ప్రమిద లోపలకు వచ్చి విద్యాధర్‌ను వింతగా చూడసాగింది. దొరబాబులా వున్న అతనెవరో ఆమెకు తెలియదు.

"ప్రమిదా! ఇతనెవరో తెలుసా? ఇరవై సంవత్సరాల క్రితం మనింటి పక్కన ఒక మాస్టరు గారుండేవారు. ఇతను వారి రెండో అబ్బాయి. నీవు అప్పుడు పసిపిల్లవు. చిన్నపుడు నిన్నెత్తుకుని ఆడించే వాడు" అని పరిచయం చేసింది మీనాక్షి.

ప్రమిద నమస్కరించింది.

"అలా అని నేనేదో ముసలాడిననుకు నేవు. నేనపుడు అయిదారేళ్ళ వాడినే" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి, ప్రమిద ఇద్దరూ పక పక నవ్వారు.

ప్రమిదను ఎగాదిగా చూచాడు విద్యాధర్. మీనాక్షి నోట్లో నుంచి ఊడి పడ్డట్టుగా వున్నది. మరీ అందంగా లేకపోయినా వికారంగా మాత్రం లేదు కాకపోతే పేదరిక కళ కొట్టొచ్చినట్టు కనపడుతున్నది.

"ఇంతకూ ఏం చదివిరిది ప్రమిద?" అడిగాడు విద్యాధర్. "అద్దంకిలో పది వరకు చదివింది. ఇక ఆ తరువాత చదువుకోవాలని దానికున్నా, చదివించే స్తోమతు నాకు లేక ఆపించాను. దీని పెళ్ళే నాకో పెద్ద సమస్యగా మిగిలింది విద్యా. ఇంతకూ నువ్వేం చేస్తున్నావో చెప్పనేలేదు" అన్నది మీనాక్షి.

"ఇంజనీరుగా పని చేస్తున్నాను. నెల్లూరులో ఉంటున్నాను. అన్నట్టు ఇదివరకు శేషాచలం మాస్టరు గారుండేవారు. ఇపుడున్నారా?" అడిగాడు విద్యాధర్.

కిరణ్మయి గురించేమైనా చెపుతుందేమోనని కుతూహలంగా చూడసాగాడు.


"అందరూ బాగానే వున్నారు. మాస్టారు రిటైరైనారు. ఒక్క కిరణ్మయి సమస్య తప్ప వారికే చింతా లేదు" అన్నది మీనాక్షి.

విద్యాధర్ మనసు కుదుటపడింది.

అంటే కిరణ్మయి కింకా పెళ్ళి కాలేదన్నమాట! అయినా ఆమె పెళ్ళి మాస్టారుకు ఒక సమస్యా? బహుశా గొప్ప సంబంధాల కోసం చూస్తుంటాడు. తాను పెద్ద ఇంజనీరు. తను వెళితే వెతకబోయిన తీగ కాలికి తగిలిందని మురిసిపోడూ?

ఇక కుదురుగా కూర్చోవటం విద్యాధర్ తరం కాలేదు.

"సరే అక్కయ్యా ఒకసారి వారింటికి వెళ్ళి చూచి వస్తాను." అని లేచాడు.




"అలాగే. భోజనానికి మాత్రం ఇక్కడికేరా." అన్నది మీనాక్షి.

"సరే." అనిలేచి శేషాచలం గారింటికి గబగబ నడవ సాగాడు విద్యాధర్.

అన్ని పూరి గుడిసెల ముందు వారి మేడ చూడగానే విద్యాధర్ శరీరం అప్రయత్నంగా పులకించింది.

ఈ సమయంలో కిరణ్మయి ఏం చేస్తున్నదో? ఈరోజు శుక్రవారం. తలంటు పోసుకుని పట్టుచీర కట్టుకుని ఉదయ భానుని లేత కిరణాలకు తన నీలి కురులను ఆరబెట్టుకుంటున్నదా? లేక టిఫిన్ ముగించి ఊయల మంచం మీద విలాసంగా కూర్చుని పేపరు చదువుకుంటున్నదా?

వేలాదిగా ఊహలు విద్యాధర్ మదిలో ప్రవేశించి ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి.

శేషాచలంగారింట్లో అడుగు పెట్టాడు విద్యాధర్. ఆయన పడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ విశేషాలు తన వ్యాఖ్యానంతో కలిపి భార్యకు వినిపిస్తున్నాడు.

చూడగానే ఇద్దరినీ గుర్తుపట్టి నమస్కరించాడు విద్యాధర్.

ఎవరూ?" అన్నాడు శేషాచలం.

తననుతాను పరిచయం చేసుకున్నాడు విద్యాధర్. వారిద్దరూ ఒక్కసారిగా ఆశ్చర్య పోయారు.

"నువ్వట్రా... అరెరె... ఎంత ఎదిగిపోయావు? అసలు గుర్తించలేకపోయాను ఎంత మారిపోయావు? రా రా..." ఆప్యాయంగా ఆహ్వానించారిద్దరూ.

ఆ ఆప్యాయతకు పొంగి పోయాడు విద్యాధర్ ఎంతైనా పల్లె ప్రజల ఆదరణ, ప్రేమ స్వచ్ఛమైనవి.

అరుగు మీద కూర్చున్నాడు విద్యాధర్.

"బాగున్నారా సార్. నేను మిమ్మల్ని మర్చిపోలేదు. అక్షరాభ్యాసం మీదగ్గరే కదూ చేశాను! మీ చలువ వలన బాగా చదువుకుని ఇంజనీరునైనాను." అన్నాడు విద్యాధర్.

"మీబోటి వారు అలా అనుకోవడమే గానీ, నిజానికి అసలు మమ్మల్ని గుర్తుంచుకుంటున్న దెవరయ్యా? ఈ మధ్య పెన్షన్ ఆఫీసుకు వెళితే నా పూర్వ శిష్యుడొకడు కనిపించాడు. నా ఫైలు వాడిదగ్గరే వున్నది. చిన్నప్పుడెపుడో నేను వాడిని కొట్టానట. ఆ కక్ష మనసులో పెట్టుకుని నన్ను కుక్కను తిప్పినట్టు తిప్పుతున్నాడు." నిట్టూర్పు విడుస్తూ అన్నాడు శేషాచలం.

కిరణ్మయి దర్శనం కోసం చూస్తున్నాడు విద్యాధర్. ఇంతలో పంతులమ్మగారు కాఫీ తెచ్చి అందించారు. తాగుతున్నాడే కానీ అతని మనసు కాఫీ మీదలేదు. ఎలా అడగాలా? అని ఆలోచిస్తున్నాడు.

"అవునుసార్... కిరణ్మయి కనపించదేం? ఇంట్లో లేదా?" అడిగాడు విద్యాధర్ శక్తినంతా

కూడదీసుకుని.

అంతే!

మరుక్షణంలోనే ఆదిదంపతుల వంటి వారి ముఖాలు కళావిహీనమై పోయాయి.

పంతులమ్మగారు ముఖం మాడ్చుకుని లోపలికు వెళ్ళిపోయారు. సగం త్రాగిన కాఫీని వదిలేశాడు శేషాచలం.

"ఏమైంది సార్?" కంగారుగా అడిగాడు విద్యాధర్.

"దాని ప్రస్తావన నాముందు తీసుకురాకు నేను సహించను." బొంగురు గొంతుతో అన్నాడు శేషాచలం.

విద్యాధర్‌కు అంతా అయోమయంగా వున్నది. "ఏమైంది సార్.... నేనేమైనా పొరపాటు మాట్లాడానా?" అన్నాడు.

"లేదుబాబూ... ఖర్మ కొద్దీ కన్నాము. ఒక్కగానొక్క కూతురని గారాబంగా పెంచాము. దానితో మాకు ఋణం తీరిపోయింది.అబ్రహాం అని చిన్నపుడు నీ క్లాస్ మేట్ ఒకడుండేవాడు. గుర్తుందా?"

"అవును." అన్నాడు విద్యాధర్ గుర్తురాకపోయినా.

"మా మాట వినకుండా మమ్మల్ని లెక్కచెయ్యకుండా, నేనొక వైపు మంచి సంబంధాల కోసం వెతుకుతుంటే, వాడితో సంబంధం పెట్టుకుని ఆ విషయం మాకు తెలిసిన తరువాత ఇంట్లో నగలు, డబ్బుతీసుకుని వాడితో ఎటో...." తరువాత పూర్తి చేయలేక పోయాడు శేషాచలం.

విద్యాధర్ స్తంభించి పోయాడు. క్రింద భూమి కంపించి నట్లయింది.

ఇరవై సంవత్సరాల నుండి తాను కంటున్న కలలు ఒక్కసారిగా ఎలా చెదిరి పోయాయి? కిరణ్మయిని స్ఫూర్తిగా తీసుకుని తను ఎంతో కష్టపడి చదివి పైకొచ్చాడు. తీరా తాను ఆశించింది అందుకుందామని వచ్చేసరికి ఆశాభంగమే మిగిలింది.

అయినా తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు విద్యాధర్. "నన్ను క్షమించండిసార్ తెలియక మిమ్మల్ని బాధపెట్టాను." అన్నాడు లేస్తూ.

"అదేమిటి లేస్తున్నావు? కూర్చోరా... ఈ పూట భోజనం మా ఇంట్లో చేయాలి" అన్నాడు శేషాచలం.

"మన్నించండి సార్. ఈ సారి వచ్చినపుడు తప్పకుండా చేస్తాను. త్వరలో నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. మీరు తప్పకుండా రావాలి" అని నేరుగా మీనాక్షి ఇంటికి వచ్చాడు.

"రా బాబూ... భోజనం రెడీ. అమ్మాయ్... తమ్ముడికి కాళ్ళకు నీళ్ళివ్వు" అన్నది మీనాక్షి.

"మీరు కూడా భోజనానికి కూర్చోండి. అందరం కలిసి భోజనం చేద్దాం" అన్నాడు విద్యాధర్.

"మగ వారు భోజనం చేయకుండా ఆడవారు తినవచ్చా?" నవ్వుతూ అన్నది మీనాక్షి.

భోజనం చేస్తూ అడిగాడు విద్యాధర్. అక్కయ్యా... ఒక మాట అడుగనా?"

"ఏమిటి?" అన్నది మీనాక్షి.

"ప్రమిదను నేను పెళ్ళి చేసుకుంటే నీకేమైనా అభ్యంతరమా?"

విస్తుపోయింది మీనాక్షి.

"అక్కయ్యతో పరాచికాలాడవచ్చా?" అన్నది.

"పరాచికాలు కాదు. నిజంగానే అడుగుతున్నాను. అక్క కూతురు నాకు వరసేగా" అన్నాడు విద్యాధర్.

కలలో కూడా ఊహించని క్రొత్త మాటలు వింటున్నాను. ఏం చూసి ప్రమిదను చేసుకుంటావు? నువ్వొ పెద్ద ఇంజనీరువు. దానికి చదువులేదు. ఆస్తి లేదు. కట్నకానుకలు రావు. పండుగలు, వేడుకలు జరిపించటానికి మామగారు లేరు. కనీసం పెళ్ళి సాధారణంగా కూడా చేసే పరిస్థితిలో లేను. ఏదైనా తగినట్లుగా ఉండాలి అన్నది మీనాక్షి నెయ్యి వేస్తూ.

"ప్రమిదలో వున్న అర్హత ఏమిటో చెప్పనా! నీ పెంపకంలో పెరిగింది. అంతకు మించి ఇంకేం కావాలి?" అన్నాడు విద్యాధర్.

ఈ సారి కొంచెం సీరియస్‌గా మారింది మీనాక్షి.

"మీ నాన్నగారికి తెలిస్తే కోప్పడతారు. ఎంతో మంది గొప్పగొప్ప వాళ్ళు తమ పిల్లలను నీకు ఇవ్వటానికి క్యూలలో నిలబడతారు. వాళ్ళ అండదండలతో నీవింకా పైకి వస్తావు. తొందర పడవద్దు" అన్నది మీనాక్షి.

"గొప్పగొప్ప వాళ్ళంతా గొప్పగుణం కలిగిన వారని నిర్ణయించలేము అక్కయ్యా. ఆస్తి అంతస్తులను బట్టి గుణాలు, స్వభావాలు, మనసులు వుండవని ఇప్పుడే గుణపాఠం నేర్చుకున్నాను. నా జీవితంలో కూడా ముందు ముందు ఇలాంటి ఆప్యాయత, ఆదరణ ఆశిస్తున్నాను అవి ప్రమిద దగ్గర పుష్కలంగా లభిస్తాయని నమ్ముతున్నాను. నాన్నగారిని నేను ఒప్పిస్తాను. నువ్వు కాదన కక్కయ్యా. ప్లీజ్. అన్నాడు విద్యాధర్.

"నీవలా అంటే నాకు కావలసిందే మున్నది? అదృష్టం నా యింటి తలుపు తట్టిందని మురిసిపోతాను. కాని మేము అలాంటివి ఆశించటం ప్రస్తుత సమాజం తీరులో నేరమవుతుంది. అందుకె ఆలోచిస్తున్నాను." అన్నది మీనాక్షి.

"అలాంటి ఆలోచనలేం పెట్టుకోకు. ప్రమిదను నేను అపురూపంగా చూచుకుంటాను. నువ్వు కూడా ఈ పని మానేసి మాతో వచ్చి మాకు తోడుగా ఉండాలి" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలాయి.

"అవునూ. సుశీల లేచి పోయిందటగా. ఇందాక నాకా సంగతి చెప్పలేదేం?" అన్నాడు విద్యాధర్ చెయ్యి కడుక్కుంటూ.

"నాకు పెళ్ళీ డొచ్చిన కూతురుంది. ఆ మాట చెప్పడానికి నాకు నోరు రాలేదు. అయినా కిరణ్మయి తనకు నచ్చిన వాడిని చేసుకుందనుకోవచ్చుగా" అన్నది మీనాక్షి.

"నీ సంస్కారం చాల గొప్పది. ఇక నేను వెళ్ళొస్తానక్కయ్యా" అన్నాడు విద్యాధర్.

"అందరినీ అడిగానని చెప్పు" అన్నది మీనాక్షి.

తృప్తి నిండిన హృదయంతో బయలు దేరాడు విద్యాధర్.

●

## హిందీ చిత్రాల్లో టి. వి. శిల్ప



అనేక టి. వి. సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన శిల్పకు హిందీ చిత్రాల్లో ఆఫర్ వచ్చిందట.

ప్రతి శనివారం టి. వి. ద్వారా ప్రసారం అవుతున్న 'భోజరాజు కథలు', గతంలో ప్రసారమైన 'తెనాలి రామకృష్ణ' యింకా మరెన్నో తెలుగు సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన శిల్ప బాగా పాపులర్ అయి దాదాపు నాలుగు చిత్రాల్లో బుక్ అయిందట.

హిందీలో నిర్మిస్తున్న 'అత్తకు యముడు అమ్మాయికి మొగుడు' చిత్రంలో ప్రదీప్ సరసన శిల్ప నటిస్తోంది. టి. వి.లో వేసిన ప్రతి వారికీ ఎప్పుడో ఒకప్పుడు సినిమా ఛాన్సు రాకుండా వుండదేమో!